సాక్షి
కుమురం భీం

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023

'ఓటింగ్' పెంచడమే లక్ష్యం..!



ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. 9లో▸



అంగన్‌వాడీల నిరసన

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. మంగళవారం పలు చోట్ల అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు వినతిపత్రం అందించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /24.8

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

29న 'సిర్పూర్'కు మంత్రుల రాక

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గంలో ఈ నెల 29న రాష్ట్ర మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించనున్నారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. కౌటాల మండల కేంద్రంలోని 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దులోని వార్ధా (గుండాయిపేట- నందివర్ధ) నదిపై రూ.75 కోట్ల వ్యయంతో నిర్మించే వంతెన పనులకు మంత్రులు శంకుస్థాపన చేస్తారని ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించనున్నట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలు హాజరై మంత్రుల పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

డిసెంబర్ 23 వరకు కేవైసీ గడువు

ఆసిఫాబాద్: జిల్లాలోని రేషన్ కార్డుదారులు డిసెంబర్ 23లోగా కేవైసీ సమర్పించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుదారులు గుంపులుగా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి డీలర్లపై ఒత్తిడి తేవద్దన్నారు. యథావిధిగా రేషన్ సరుకులు పంపిణీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేవైసీపై కార్డుదారులు ఆందోళనకు గురికాకుండా, గడువులోగా కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌టౌన్: గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో గణపతి మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, అన్నివర్గాల ప్రజలు సామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా డీజేల వినియోగానికి అనుమతి లేదని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, విద్యుత్ శాఖ డీఈఈ రాజశేఖర్‌రావు, ఎస్సైలు కల్యాణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు, ఓపీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేనీ, ఎల్‌టీ ఉద్దల్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం చెస్, హాకీ, నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ పోటీల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. క్రీడల్లో సత్తా చాటిన వారిని మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, డీఎస్‌వో మీనారెడ్డి, నెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్, పీడీలు, పీఈటీలు తిరుపతి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బేరసారాలు..!?

- చోటామోటా నేతలకు గాలం
- ఎన్నికల వేళ అభ్యర్థుల ఎత్తుగడ
- ప్రతిపక్ష నాయకులకు భారీ ఆఫర్లు
- తమ పార్టీలో చేరాలంటూ రాయభారం
- మాట వినని నేతలపై కక్ష సాధింపు చర్యలు
- సొంత పార్టీ కార్యకర్తలు జారిపోకుండా ప్రత్యేక దృష్టి



సాక్షి, ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో ప్రధాన పార్టీల మధ్య నువ్వా.. నేనా అన్న రీతిలో తీవ్ర పోటీ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్నది బీఆర్‌ఎస్‌లో స్పష్టం కాగా.. కాంగ్రెస్ పార్టీలో ఇంకా తేలలేదు. అయినా పార్టీ టికెట్ తమకే వస్తుందనే ధీమాతో ఉన్న ఆశావహులు ప్రచారంలోనే కాకుండా.. అధికార పార్టీ బలబలాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. మండలాలు, గ్రామాల వారీగా ఆయా పార్టీల్లో బలమైన నాయకులు ఎవరు..? వారి బలహీనతలు ఏమిటి..? వారు పార్టీ ఫిరాయిస్తే గెలుపోటములపై ఎలాంటి ప్రభావం చూపుతుంది..? అనే అంశాలపై బేరీజు వేసుకుని, బేరసారాలకు దిగుతున్నట్లు సమాచారం. గ్రామ, మండలస్థాయి నేతలకు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు నజరానాలు ఇచ్చి పార్టీల్లోకి ఆహ్వానిస్తుండటంతో జిల్లా రాజకీయాల్లో వేడి రాజుకుంటోంది.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. అధికార పార్టీ సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ అభ్యర్థులుగా కోనేరు కోనప్ప, కోవ లక్ష్మిలను ప్రకటించింది. కాంగ్రెస్‌లో సిర్పూర్ నియోజకవర్గానికి కొర్శ కృష్ణారెడ్డి, రావి శ్రీనివాస్‌లలో ఒక్కరికి టికెట్ దక్కే అవకాశం ఉంది. అలాగే ఆసిఫాబాద్‌లోనూ గణేష్‌రాథోడ్, శ్యాంనాయక్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఎవరికి వారు సొంత ప్రచార రథాల్లో నియోజకవర్గాల్లో ఊరువాడా తిరుగుతూ ప్రచారం మొదలెట్టారు. ఆసిఫాబాద్‌లో బీజేపీకి అంతగా పట్టులేకపోగా.. సిర్పూర్ నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు మెండుగానే ఉన్నాయి. అదేవిధంగా బీఎస్పీ కూడా అధికార పార్టీకి సవాలు విసరనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ బరిలో దిగనున్న అభ్యర్థులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రచారాలు మొదలెట్టి.. ప్రత్యర్థి పార్టీ నేతలకు గాలం వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ద్వితీయ శ్రేణి నేతలకు గాలం..!

త్వరలో జరగనున్న ఎన్నికలకు జిల్లాలో అన్ని రాజకీయపార్టీలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్న నేతలు.. అదేసమయంలో ప్రత్యర్థి పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయశ్రేణి నేతలకు గాలం వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ కోసం కష్టపడ్డా తమకు ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదన్న ఆక్రోశంతో ఉన్న వారిపై కాంగ్రెస్ పార్టీ కన్నేసినట్లు సమాచారం. ఒక్కో నేతకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఇచ్చి వారి సేవల్ని ఎన్నికల్లో వినియోగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. టీఎస్‌ఎస్‌ఎఫ్ నేతకు సైతం భారీ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అధికార పార్టీ సైతం అదే పంథాలో వెళ్తున్నట్లు సమాచారం. ఒకవేళ మాట వినని ద్వితీయశ్రేణి నాయకులపై అవసరమైతే 'సామ..దాన..దండోపాయాలు..' వినియోగించి తమ వైపునకు తిప్పుకోవడానికి యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సిర్పూర్ నియోజకవర్గంలోనూ ఇదేవిధంగా ఆయా పార్టీలు తమ బలం పెంచుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటీవల ఆయా పార్టీల్లో చేరికలన్నీ ఇంచుమించు ఇలాంటివేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ కార్యకర్తలు జారిపోకుండా చర్యలు..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులు తమ నుంచి జారిపోకుండా ఆయా పార్టీల అగ్రనేతలు ప్రత్యేక దృష్టి సారించారు. అందుకనుగుణంగా వారిని మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. వచ్చే ఎన్నికల్లో తాము గెలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇక పార్టీ మారేందుకు సిద్ధమవుతున్న కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి పార్టీలో కొనసాగే విధంగా ఆయా పార్టీలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

శ్రమకు తగ్గ ఫలితం



గోలేటి టౌన్‌షిప్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

- సింగరేణి లాభాల్లో వాటా 32 శాతం
- కార్మికులకు రూ.711 కోట్లు పంపిణీ

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. లాభాల్లో వాటా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన కార్మికులకు ఎట్టకేలకు కంపెనీ చెల్లించే వాటాను ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ నర్సింగరావు మంగళవారం కార్మికులకు సింగరేణి గత ఆర్థిక సంవత్సరం 2022-23లో సాధించిన లాభాల్లో నుంచి 32శాతం వాటా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 1999 నుంచి కార్మికులకు వాటా చెల్లించే హక్కు మొదలైంది. అప్పటివరకు నష్టాల్లో ఉన్న కంపెనీ ఆ సంవత్సరం నుంచి లాభాల బాట పట్టడంతో అందులో నుంచి కార్మికులకు వాటా చెల్లిస్తూ వస్తున్నారు. ఏఐటీయూసీ హయాంలో నాటి దివంగత ఏఐటీయూసీ నేత కేఎల్ మహేంద్ర అప్పటి ప్రభుత్వంతో సమ్మె సందర్భంగా జరిగిన చర్చల్లో లాభాలు వస్తే అందులో నుంచి కార్మికులకు వాటా చెల్లించే హక్కు మొదలైంది. మొదటగా 1998-99లో రూ.121 కోట్లు లాభాలు సాధించగా అప్పుడు 10 శాతంగా రూ.12 కోట్లు కార్మికులకు పంచారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి 16 శాతానికి పెంచి ఇచ్చారు. తెలంగాణ వచ్చిన తర్వాత నుంచి లాభాల వాటా గణనీయంగా పెరుగుతూ వచ్చి ఇప్పుడు 32 శాతానికి చేరింది.

కంపెనీ సాధించిన లాభాలు.. పంచిన తీరు..

ఆర్థిక సంవత్సరం	వచ్చిన లాభం (రూ. కోట్లలో)	పంచిన శాతం	పంచిన డబ్బులు (రూ.కోట్లలో)
2013-14	418	20	83.06
2014-15	490	21	103
2015-16	1066	23	245
2016-17	395	25	99
2017-18	1212	27	327
2018-19	1765	28	494
2019-20	993	28	278
2020-21	272.64	29	79.07
2021-22	1227	30	368
2022-23	2222	32	711.04

లాభాల వాటా పెంపుపై టీబీజీకేఎస్ సంబురాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు చెల్లించే వాటా పెంపును హర్షిస్తూ మంగళవారం సాయంత్రం గోలేటి టౌన్‌షిప్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. సింగరేణి బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రత్యేక చొరవతో 10 శాతం ఉన్న లాభాల వాటా నేడు 32 శాతానికి పెరిగిందన్నారు. సింగరేణి సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.2,222 కోట్ల లాభాలను గడించిందని పేర్కొన్నారు. లాభాల్లో వాటా పెంపు కార్మికులు సాధించిన విజయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, వెంకటేశ్వర్లు, సుగ్రీవులు, రాజేశం, మహేందర్‌రెడ్డి, రామ్మోహన్, కైత స్వామి, మహేశ్, సాగర్, మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి స్ఫూర్తి ఐలమ్మ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: పెత్తందార్ల దోపిడీకి అడ్డుగా నిలిచి, తెగువతో పోరాడి చాకలి ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మితో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ తెగువ, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనిత ఐలమ్మ అని అన్నారు. అంత గొప్ప వ్యక్తి జయంతి వేడుకలు రాష్ట్రంలో అధికారికంగా నిర్వహిస్తూ నివాళులర్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి, ఎంపీపీలు అరిగెల మల్లికార్జున్, సౌందర్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సహకారం అవసరం

ఆసిఫాబాద్: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల సహకారం అవసరమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ కలెక్టర్, దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ నెల 19 వరకు నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ నెల 28న ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి, అక్టోబర్ 1న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. పొరపాట్లకు తావులేని, స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు బూత్‌స్థాయి అధికారులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తిచేయడంలో విఫలం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానెపల్లి: రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. చింతలమానెపల్లి మండల కేంద్రంలో మంగళవారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో నిర్మించాల్సిన ప్రాజెక్టులను ఇతర ప్రాంతానికి తరలించి రైతాంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు. అర్కగూడ ప్రాజెక్టు 14 ఏళ్లయినా నేటికీ పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని మండిపడ్డారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. దరంపల్లి వాగుపై వంతెన నిర్మిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు మోర్ల గణపతి, జ్యోతి, నవీన్, రాంప్రసాద్, లహంచు తదితరులు ఉన్నారు.

ఆలస్యం.. ఆపై చిన్నసైజు

- చేపపిల్లల పంపిణీలో తీవ్ర జాప్యం
- జిల్లా టార్గెట్ 1.4కోట్లు
- ఇప్పటి వరకు పంపిణీ చేసింది 30 లక్షలే..
- సొంతంగా కొనుగోలు చేస్తున్న మత్స్యకారులు



చేపపిల్లలను చూపుతున్న మత్స్యకారుడు



మత్స్యకారులు తిరస్కరించడంతో పంపిణీ చేయకుండా వెనక్కి తీసుకెళ్తున్న చేపపిల్లలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోంది. దీని కోసం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తోంది. అయితే ఈ ఏడాది జిల్లాలో చేపపిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. గతనెలలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మత్స్యశాఖ అధికారులు మండలాల వారీగా చెరువులు, కుంటల్లో విడుదల చేసేందుకు సకాలంలో చేపపిల్లలు అందించకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తుండటంతో అదను దాటిపోతోందని మదన పడుతున్నారు.

30 శాతం కూడా పంపిణీ కాలే..

జిల్లాలో 10,948 హెక్టార్ల విస్తీర్ణంలో జలాశయాలు, చెరువులు, కుంటలు విస్తరించి ఉన్నాయి. 60 మత్స్య పారిశ్రామిక సంఘాల ఉండగా, పేర్లు నమోదు చేసుకున్న సభ్యులు 3,500 మంది వరకు ఉన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో 1.4 కోట్ల చేపపిల్లలు ఉచితంగా అందించాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా టెండర్లు పిలిచి చేపపిల్లలు సిద్ధం చేసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 30 శాతం చేప పిల్లలు కూడా పంపిణీ చేయలేకపోయారు. వివిధ కారణాలతో ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఇప్పటి వరకు సుమారు 30లక్షల చేపపిల్లలు మాత్రమే పంపిణీ చేయగలిగారు.

'చిన్న సైజు'పై అనాసక్తి..

రాష్ట్ర ప్రభుత్వం జలాశయాలు, చెరువులు, కుంటలకు వేర్వేరు సైజుల్లో చేపపిల్లలను అందిస్తోంది. 80- 100 మిల్లీమీటర్ల సైజులో ఉన్న పిల్లలను జలాశయాలకు కేటాయిస్తుండగా.. చిన్న చిన్న చెరువులు, కుంటల కోసం 35- 45 మిల్లీమీటర్ల సైజు వాటిని అందిస్తోంది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో పెంచేందుకు ప్రభుత్వం అందించే చేపపిల్లలు ఏమాత్రం అనువుగా లేవని మత్స్యకారులు మండిపడుతున్నారు. పంపిణీ ఆలస్యం కాగా, చిన్నసైజు వాటిని అందిస్తే నీరు ఇంకిపోయే సమయానికి అవి ఏ మాత్రం పెరగక ఆర్థికంగా నష్టపోతామని పేర్కొంటున్నారు. చెరువులు, కుంటల్లో చేపపిల్లలు కిలో బరువు పెరగాలంటే 7 నుంచి 9నెలలు పడుతుంది. సాధారణంగా చెరువులు, కుంటల్లో నీళ్లు జనవరి, ఫిబ్రవరి వచ్చే సరికే ఇంకిపోయి వట్టిపోయే దశకు చేరుతాయి. మత్స్యశాఖ జూలై, ఆగస్టులో చేపపిల్లల పంపిణీ చేపడితే ఉపయోగకరంగా ఉండేదని మత్స్యకారులు అంటున్నారు. రెబ్బెన మండలంలోని మత్స్యకారులకు పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన చేపపిల్లలను సైజు చిన్నగా ఉన్నాయనే కారణంతో మత్స్యకారులు తిరస్కరించి వెనక్కి పంపించారు.

కొంగలకే అయితయి



ప్రభుత్వం ఆలస్యంగా, అది కూడా చిన్నసైజు చేపపిల్లలు అందిస్తే ఏం చేసుకోవాలో తెలియడం లేదు. చిన్న సైజు పిల్లలు చెరువులో పోస్తే కొంగలకే అయితయి. ఆగస్టులో ఇస్తే ఉపయోగకరంగా ఉండేది. ఆలస్యంగా పిల్లలు ఇచ్చినా కాస్త పెద్దసైజువి ఇస్తే తప్పా ఉపయోగం ఉండదు.

– ఇల్యాల రామయ్య, మత్స్యకారుడు, నంబాల

సొంతంగా కొనుగోలు



ప్రభుత్వం అందించే చేపపిల్లల నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటుంది. మేమే సొంత డబ్బులతో ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు చేసి చెరువులో పోసుకున్నాం. ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలు ఏనాడు పెరగలేదు. డబ్బులు పెట్టి కొన్నవి రెండు నెలల్లోనే అరకిలో బరువు వరకు పెరిగితే, ప్రభుత్వం అందించేవి 100 గ్రాములు కూడా దాటవు.

– బక్క పోషయ్య, మత్స్యకారుడు, నంబాల

20 రోజుల్లో పూర్తి చేస్తాం

జిల్లాలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మరో 20 రోజుల్లో జిల్లా అంతటా పంపిణీ ప్రక్రియ పూర్తవుతుంది. ఇప్పటివరకు 30 లక్షల వరకు చేపపిల్లలు మత్స్యకారులకు అందించాం. ప్రభుత్వం సూచించిన విధంగానే చేపపిల్లలు అందిస్తున్నాం. పెద్దసైజు చేపపిల్లలు కావాలంటే ముందుగానే లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి.

– విజయ్‌కుమార్, జిల్లా మత్స్య శాఖాధికారి

మూడో రైల్వేలైన్ పనులు పరిశీలన



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): కాజీపేట- బల్లార్షా ప్రధాన రైల్వే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న మూడో లైన్ పనులను మంగళవారం రైల్వే డీఆర్‌ఎం బీకే జైన్‌తోపాటు సీఆర్‌ఎం బృందం సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు మూడో రైల్వేలైన్‌తోపాటు సిర్పూర్(టి) రైల్వే స్టేషన్, ప్లాట్‌ఫాం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైల్వే డీఆర్‌ఎం బీకే జైన్‌కు సిర్పూర్(టి) మండలానికి చెందిన నాయకులు వినతిపత్రం అందజేశారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని కోరారు. నాయకులు సోహెల్ అహ్మద్, చునార్కర్ ఉమాజీ, పైడి నానాజీ, కరుణాకర్‌గౌడ్, తులసీరాం, ఇఫాత్‌హుస్సేన్, మల్కరి ప్రసాద్, నసీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెగిన ఆర్టీసీ బస్సు స్టీరింగ్ వైరు


రోడ్డుపై నిలిచిన బస్సు

కాగజ్‌నగర్‌టౌన్: ఆర్టీసీ బస్సు స్టీరింగ్ వైరు తెగిన ఘటన కాగజ్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్‌కు మరమ్మతు నిమిత్తం బయలుదేరిన ఆర్టీసీ బస్సు పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్దకు రాగానే స్టీరింగ్ వైరు ప్రమాదవశాత్తు తెగింది. దీంతో బస్సు నిలిచిపోగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టింది. బస్సులో ప్రయాణికులు, అంబులెన్స్‌లో రోగులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా, అంబులెన్స్ ముందు భాగం స్వల్పంగా ధ్వంసమైంది. డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బావిలో పడి ఒకరి మృతి

లక్సెట్టిపేట: మర్రిపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య (57) ప్రమాదశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య ఈనెల 24వ తేదీ ఉదయం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి గట్టు సమీపంలోని వేపచెట్ల ఇరుస్తుండగా అదుపుతప్పి జారి అందులో పడిపోయాడు. శంకరయ్య సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికారు. మంగళవారం అతడి మృతదేహం బావిలో తేలగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి వివాహం కాలేదు. అతడి అన్న రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షంషీర్‌నగర్‌లో చోరీ

బెల్లంపల్లి: మున్సిపల్ పరిధిలోని షంషీర్‌నగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. రెండ్రోజుల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికంగా నివాసముండే బాబా తన కుటుంబ సభ్యులతో వేరే గ్రామానికి వెళ్లాడు. వారంపాటు అక్కడే ఉండి మంగళవారం ఇంటికి చేరుకున్నాడు. ఇంటితాళాలు పగుల గొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లోని రెండు తులాల బంగారం, 14 తులాల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి గాయాలు


కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ప్రైవేట్ పాఠశాల వద్ద రామన్న అనే వ్యక్తిని మంగళవారం వీధికుక్క కరిచి గాయపరిచింది. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన రామన్న పాఠశాల సమీపంలో చర్చి నిర్మాణ పనులకు వచ్చాడు. స్థానిక ఇసుక కుప్ప వద్ద ఓ వీధికుక్క రామన్నపై దాడి చేసింది. కాలిని కరిచి గాయపరిచింది. దీంతో రామన్న స్థానిక పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నాడు.

టైర్ పేలి లారీ బోల్తా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పీఎస్ పరిధిలోని జీఎం కార్యాలయం వద్ద 363 జాతీయ రహదారిపై చంద్రపూర్ నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీలోని కోళ్ల దాణా లోడ్ కొంత కిందపడింది. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వద్దన్నా.. వదలడు..!

- ఆరోపణలు, నిర్లక్ష్యంతో సివిల్ సప్లయ్ డీఎం సరెండర్
- ఏడాదిలో నాలుగు చోట్లకు బదిలీ
- చివరికి నచ్చినచోట అదే పోస్టులోకి..
- ఇక్కడికే రావడంలో ఆంతర్యమేమిటో?



మంచిర్యాలఅగ్రికల్చర్: విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న జిల్లా అధికారిని తిరిగి అందలం ఎక్కించారు. గతేడాది యాసంగి ధాన్యం సేకరణ సమయంలో విధుల్లో నిర్లక్ష్యం, ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ (డీఎం)ను అప్పటి కలెక్టర్ భారతి హోళ్లికేరి కమిషనరేట్‌కు సరెండర్ చేయగా.. తిరిగి ఏడాది కాలంలోనే మళ్లీ ఇదే జిల్లాకు సేమ్ పోస్టింగ్‌లో రావడం గమనార్హం. రైతుల అవస్థలపై 'ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం'.. 'ధాన్యం సేకరణకు రోడ్డెక్కాల్సిందేనా..' తదితర సాక్షి కథనాలతో విచారణ చేపట్టిన అప్పటి కలెక్టర్ ఆ అధికారిపై సరెండర్ వేటు వేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులు రోజుల తరబడి నిరీక్షించడం, గన్నీ బ్యాగులు, లారీలు సమకూర్చడంలో జాప్యం చేయడం, మిల్లులు, గోదాంలకు ధాన్యం తరలించకపోవడం, లారీలు సమకూర్చడంలో విఫలం కావడం, ధాన్యం సేకరణకు సంబంధించి రోజువారీగా కలెక్టర్‌కు నివేదికలు అందజేయకపోవడం తదితర కారణాలతో 'ఈ అధికారి మాకొద్దు' అంటూ తొమ్మిది రకాల అభియోగాలతో సరెండర్ చేస్తూ అప్పటి కలెక్టర్ రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనరేట్‌కు లేఖ రాశారు. దీంతో అతడిని కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. అప్పటినుంచి డీఎం స్థానంలో కొన్ని నెలలుగా ఇన్‌చార్జి అధికారిగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ వ్యవహరించారు. ఆ తర్వాత మంచిర్యాల ఆర్డీవో వేణు విధులు నిర్వహించారు. ఆర్డీవో వేణు పదోన్నతి, బదిలీపై వేరే జిల్లాకు వెళ్లగా ఆ స్థానం ఖాళీ అయింది.

నాలుగు స్థానాలు మారినా..

రాష్ట్ర కమిషనరేట్‌కు 28మే 2022న కలెక్టర్ ఇక్కడి డీఎంను సరెండర్ చేయగా ఆయనకు కొద్దిరోజుల్లోనే కమిషనరేట్ నుంచి తిరిగి మెదక్ జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ కొద్ది నెలల్లోనే నిర్లక్ష్యం, పలు ఆరోపణలతో అక్కడి ఉన్నతాధికారులు మళ్లీ రాష్ట్ర కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. తిరిగి ఈ ఏడాది ఆరంభంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు డీఎంగా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంగా ఉన్న మంచిర్యాల ఆర్డీవో వేణు వేరే జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో కుమురంభీం ఆసిఫాబాద్ డీఎంగా పని చేస్తున్న 'సరెండర్ అధికారి' తిరిగి మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంగా ఆగస్టులో వచ్చారు. నెల వ్యవధిలోనే అతడికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. రెండు జిల్లాలకు, రెండుసార్లు కమిషనరేట్‌కు మారి తిరిగి మంచిర్యాల జిల్లాకు రావడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో పలుకుబడి కలిగిన ఇద్దరు నేతల సాయంతో తను అనుకున్న జిల్లా, స్థానానికి చేరడంలో కొన్ని నెలల్లోనే సఫలీకృతుడయ్యారు. ఆ శాఖలో అన్నీ తానై చూసుకోవడంతో పాటు పలు మిల్లర్లకు దగ్గరగా ఉంటూ ధాన్యం సేకరణలో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాపై ఎందుకంత ప్రేమ?

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ డీఎంగా పనిచేసిన సదరు అధికారి జిల్లా ఆవిర్భావంతో 2016 నుంచి 2017 వరకు ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2019 జూన్‌లో పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించగా 2022 మేలో సరెండర్ చేశారు. తన పలుకుబడి, అన్ని రకాల అస్త్రాలను ఉపయోగించి ఏడాది కాలంలో ఆగస్టు 3న జిల్లాలో అదే స్థానంలో పోస్టింగ్ పొందారని గుసగుసలు వినిపిస్తున్నాయి. సొంత జిల్లాకు పోస్టింగ్ వచ్చేలా పైరవీలు చేసుకుంటున్న ఈ రోజుల్లో తన సొంత జిల్లా కాకపోయినా.. మరోవైపు నిర్లక్ష్యం, పలు ఆరోపణలతో ఈ జిల్లా నుంచి సరెండర్ అయినా మళ్లీ ఇదే జిల్లాకు రావడానికి ఆయనెందుకు ఇష్టపడుతున్నారనే విషయమై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన వారితో ప్రిన్సిపాల్, పీఈటీ

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల విద్యార్థినులు సంజన, నైతిక అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జోబి, పీఈటీ రాజేశం తెలిపారు. వీరు అక్టోబర్ రెండో వారంలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

రెజ్లింగ్‌లో విద్యార్థినికి వెండి పతకం


పతకం సాధించిన భువనేశ్వరితో సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని భువనేశ్వరి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. ఈనెల 23వ తేదీన తొర్రూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో భువనేశ్వరి రెజ్లింగ్ విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. వెండి పతకం సాధించగా మంగళవారం ఆమెను పీఈటీ మల్లిక, ఉపాధ్యాయులు అభినందించారు.

'గుర్తింపు' ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యానికి ఎన్నికలు నిర్వహించాలని లేదని, రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పలుసార్లు యజమాన్యం ఎన్నికలు ఆపడానికి కోర్టుకు వెళ్లిందని తెలిపారు. చివరగా ఇటీవల ఎన్నికలు ఆపడానికి హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఇక తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. బుధవారం రిటర్నింగ్ అధికారి సమక్షంలో జరిగే సమావేశంలో ఎన్నికల తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలా? లేదా నాలుగు సంవత్సరాలా? అనేది సీఎల్సీ నిర్ణయిస్తారని దానికి కట్టుబడి ఉండాలని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ కిషన్‌రావు, నాయకులు ఆకుల లక్ష్మణ్, దాడి రాజయ్య, రమేశ్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

స్పేర్స్ కొరత తీర్చాలి

సింగరేణి భూగర్భగనుల్లో వాడే ఎస్‌డీఎల్ యంత్రాలకు స్పేర్స్ కొరత తీవ్రంగా ఉందని సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఆర్కే 7 గని పై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాలం చెల్లిన యంత్రాలను అధికారులు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. వాటి స్పేర్స్ కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. చివరికి వాటికి వినియోగించే ఆయిల్ కూడా నాసిరకంగా వస్తోందని తెలిపారు. దీంతో యంత్రాలు మరింత చెడిపోతున్నాయని పేర్కొన్నారు.

ఎస్టీపీపీలో సూపర్‌బజార్ పునఃప్రారంభిస్తాం


సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లోగల సింగరేణి సూపర్ బజార్‌ను పునఃప్రారంభించనున్నట్లు సింగరేణి సూపర్ బజార్ ఎండీ సామ్యూల్ సుధాకర్ తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం ఎస్టీపీపీని సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో ఎస్టీపీపీ అధికారులు ఆయనను శాలువాలతో సన్మానించారు. గతంలో ఇక్కడ సూపర్ బజార్ నిర్వహించినా ప్రస్తుతం వినియోగంలో లేక మూతపడిందని అధికారులు ఎండీకి తెలిపారు. మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. దీంతో ఎండీ స్పందిస్తూ సూపర్‌బజార్‌ను పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, డీవైపీఎం సుదర్శన్, వెల్ఫేర్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్ తదితరులున్నారు.

రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలి


గనిలోకి దిగుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: భూగర్భగనుల్లో రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 7గనిని తనిఖీ చేశారు. ఏజెంట్ ఎం.రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్‌తో కలిసి గని భూగర్భంలోని పని స్థలాలను పరిశీలించారు. గనిలోపల ఉద్యోగులతో మాట్లాడారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే కంపెనీకి శ్రేయస్కరమని తెలిపారు. రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికులకు సూచించారు. తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డ్యూటీకి వచ్చేటప్పుడు కూడా ఉద్యోగులు హెల్మెట్ ధరించి విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, గ్రూప్ ఇంజినీర్ రాజా రవిచరణ్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్, గుర్తింపు సంఘం పిట్ సెక్రటరీ మెండ వెంకటి, అధికారులు రవీందర్, రవితేజ, శ్రీనివాస్ ఉన్నారు.

కూతురిపై లైంగిక దాడి.. తండ్రికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించి, కన్న కూతురుపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ రమేశ్ తీర్పు వెలువరించారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని జంజిరాల వెంకటి పదో తరగతి చదువుతున్న తన మైనర్ కుమార్తెను తరచూ లైంగికంగా వేధించేవాడు. ఈ క్రమంలోనే 2022 జూలైలో ఇంట్లోనే లైంగికదాడికి పాల్పడ్డాడు. 2022 నవంబర్ 13 రాత్రి మరోసారి లైంగిక దాడికి యత్నించగా, బాలిక ఆ విషయాన్ని తల్లి వాణి దృష్టికి తీసుకెళ్లింది. వాణి కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రవీందర్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు.

రిటైర్డ్ కలెక్టర్ ఇంట్లో చోరీ

- రూ.2లక్షలు అపహరణ

జన్నారం: హైదరాబాద్ రిటైర్డ్ కలెక్టర్ శర్మన్ నాయక్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని కలమడుగు పంచాయతీ పరిధి రాంనాయక్ తండాలో చోటు చేసుకుంది. రిటైర్డ్ కలెక్టర్ మనుమడు లావుడ్యా సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన లావుడ్యా శర్మన్ నాయక్ రాంనాయక్ తండాలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆయన కూతురు సుజాత, కుటుంబ సభ్యులు రాంనాయక్ తండాలోని తన నివాసంలో ఉంటున్నారు. రోజులాగే ఈనెల 25న రాత్రి 10 గంటలకు భోజనం చేసి నిద్రించారు. 26న ఉదయం 8గంటలకు సుజాత ఇల్లు శుభ్రం చేసేందుకు శర్మన్‌నాయక్ గది వద్దకు వెళ్లేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో గదిలోకి వెళ్లి పరిశీలించగా రూ.2లక్షలు కనిపించలేదు. వెంటనే ఎస్సై సతీశ్‌కు సమాచారం ఇవ్వగా లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. సాయిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో అడ్మిషన్ల కోసం గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైటెక్‌సిటీ, మాదాపూర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇంపర్‌టింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో శిక్షణ పొందగోరే వారు 18-35 ఏళ్లలోపు ఉండాలని, 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు అక్టోబర్ 5లోపు సంబంధిత గిరిజన సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సర్ఫేస్‌లోగల పలు విభాగాల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఉద్యోగాల భర్తీ కోసం మంగళవారం ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియార్టీ ప్రాతిపాదికన ఉద్యోగులను ఎంపిక చేయనున్నట్లు ఎస్వో టూ జీఎం రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన వారిని ఏరియాలోని వర్క్‌షాపు, ఓసీలు, సర్ఫేస్ డిపార్ట్‌మెంట్‌లలో వినియోగించుకుంటామని పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఇంజినీర్ సూర్యనారాయణరాజు, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీవైపీఎం సత్యబోస్, ఆసీఫ్ ఉన్నారు.

ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని ధర్నా


ధర్నా చేస్తున్న గిరిజన నిరుద్యోగులు

కౌటాల(సిర్పూర్): ఆదివాసీ నిరుద్యోగుల కోసం ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కౌటాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం గిరిజన నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకే ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచులు ఉర్వత్ జీజాబాయి, చరందాస్, సోమయ్య, ఆట సంఘం నాయకులు పోచాని, సాయినాథ్, సత్తయ్య, నిరుద్యోగులు విఘ్నేశ్, భారత్, సాయికృష్ణ, రుమాజీ, నాగేంద్రబాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి మేస్త్రీ మృతి

మంచిర్యాల క్రైం: అతిగా మద్యం సేవించి తీవ్ర అస్వస్థతతో మేస్త్రీ మృతి చెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపెల్లి మండలం బురుగుగూడెంకు చెందిన కారు దామోదర్ (24) మూడేళ్ల క్రితం ఉపాధి కోసం మంచిర్యాలకు వచ్చాడు. స్థానిక వినాయకనగర్‌లో అద్దె గదిలో ఉంటూ మేస్త్రీ పనికి వెళ్తున్నాడు. ఈనెల 24న అతిగా మద్యం తాగి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు అతడిని ఇంటికి చేర్చారు. మంగళవారం తోటి కార్మికులు దామోదర్ కోసం వచ్చి చూడగా మరణించి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అన్యాయం జరిగిందని ఆత్మహత్యాయత్నం


పురుగుల మందు తాగి డబ్బా చూపిస్తున్న మల్లేశ్

దండేపల్లి: కొడుకు ప్రేమ పెళ్లి వివాదంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ కుటుంబానికి తీరని అన్యాయం చేశారని మండలంలోని మామిడిపల్లికి చెందిన చాతరాజు మల్లేశ్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లేశ్ కొడుకు సుమన్ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు బాగానే ఉన్న సుమన్ దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈవిషయంలో గ్రామానికి చెందిన కొందరు తమ కోడలు పక్షాన నిలిచి తమను కేసుల పాలు చేశారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఆస్తులు అమ్ముకున్నామని మల్లేశ్ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట పోలీసులు, గ్రామస్తులతో వాపోయాడు. ఇదే క్రమంలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. వెంటనే అక్కడే ఉన్న ఎస్సై ప్రసాద్, సిబ్బంది అతడిని తమ వాహనంలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కాగా, లక్సెట్టిపేట ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మల్లేశ్ వాంగ్మూలాన్ని తీసుకున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చెన్నూర్: హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. జ్వరాలతో బాధ పడుతున్న వారికి సరైన వైద్య సేవలందించాలని స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎల్లక్కపేటలోగల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాతో పాటు చెన్నూర్ చుట్టుపక్కల మండలాల్లో నెల రోజులుగా ప్రజలు డెంగీ, విషజ్వరాలతో అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెన్నూర్ ఆరోగ్యకేంద్రంలో రోగులకు సరైన సేవలందడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చందు, ఎండీ అవేజ్, పట్టణ కార్యదర్శి కావిర రవి, నాయకులు మారయ్య, రేణుక, సమ్మక్క, భూదేవి, పోసక్క, సరిత, ఆస్మాబేగం, నాగేశ్, సంధ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలకు ప్రాధాన్యమివ్వాలి


మాట్లాడుతున్న సుజాత

బెల్లంపల్లి: రాష్ట్రంలో అట్టడుగు స్థానంలో ఉన్న బేడ, బుడగ జంగాలకు అన్ని రాజకీయ పక్షాలు వచ్చే ఎన్నికల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బేడ, బుడగ జంగాల హక్కుల దండు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మోతె సుజాత డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు అన్ని రాజకీయపార్టీలు తమను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని విమర్శించారు. బుడగ జంగాల హక్కుల పరిరక్షణ, రాజకీయ ప్రాధాన్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దళితబంధు పథకంలో తమకులానికి వాటా ప్రకటించాలని కోరారు. ఆర్థికంగా బలోపేతం కావడానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించాలని, గురుకుల విద్యాలయాల్లో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా బుడగ జంగాల విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలు వేసి సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. తమ కులానికి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గ్రామాల్లో పరిశుభ్రత పనులు చేపట్టాలి


కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పరిశుభ్రత పనులు చేపట్టాలని, రోడ్లపై ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంతోపాటు పౌనూర్ గ్రామాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించి సూచనలు చేశారు. ప్రతీరోజు రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేయాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించాలని పేర్కొన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్, బయోటెక్ స్ప్రే చేయాలని సూచించారు. అనంతరం డంపుయార్డును పరిశీలించారు. శ్మశానవాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వినియోగించాలని అన్నారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, స్థానిక సర్పంచ్ ఆసంపల్లి సువర్ణరాజమల్లు, సారయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్‌కుమార్, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.